# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### ❖ డీజిల్ ఇంజన్ల రోజులు మళ్లొస్తయ్..



భీంపూర్, నవంబర్ 28 : కాంగ్రెస్ హయాంలో సాగుకు నాలుగు గంటలే ఇచ్చేవారు. ఇచ్చిన కరెంటులో కూడా లో, హై వోల్టేజీ కారణంగా మోటర్లు బ్లాస్ట్ అవుతుండే. మోటరును తీసుకెళ్లడానికి కూలీలకు ఇద్దరికి రూ.500 చొప్పున రూ.1000 ఖర్చవుతుండే. నేను గూడా వెళ్లాలి కాబటి నా పని అంతా పోయేది. రిపేరుకు ఏం లేదన్నా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చయ్యేది. ఇట్లా ఒక పంట కాలంలో దాదాపు మూడు నుంచి నాలుగు సార్లు మోటర్లు కాలిపోయేవి. రిపేరు చేయించికచ్చి పెట్టేంతో పంటలు ఎండిపోయి దిగుబడి తక్కువగా వస్తుండే. ఇలా ఖర్చు ఎక్కువవుతుందని డీజిల్ ఇంజిన్లు కూడా పెట్టినం. వీటికి కూడా డబ్బులు బాగా అవుతుండే. సీఎం కేసీఆర్ సారు 24 గంటల కరెంటు బాగుంది. ఏ ఖర్చు లేకుండా ఉచితంగా కరెంటు రావడంతో మంచిగా పంటలు పండిస్తున్నాం. సంతోషంగా ఉంది. గీ కాంగ్రెసోళ్లు మళ్లీ మోసం చేయాలని చూస్తున్నరు. కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వం.

### ❖ రంది లేకుంట ఎవుసం..



భీంపూర్, నవంబర్ 28 : ఒకప్పుడు మా పిప్పల్‌కోటిలో తాగు సాగునీరు దొరుకుడే కష్టంగుండే. మా ఊరికి పిల్లను ఇయ్యడానికి వెనకా ముందు చేస్తుండె. ఎప్పుడైతే రాష్ట్రం ఏర్పడిందో, సీఎం కేసీఆర్ సార్ అన్నదాత మీద శ్రద్ధ తీసుకున్నారో అపుడు మా దశ మారింది. సీఎం కేసీఆర్ సార్ మా పిప్పల్‌కోటి శివారుల నిర్మిస్తున్న రిజర్వాయర్‌తో ఈ ప్రాంతంలో భూముల ధరలూ పెరిగాయి. 50 వేల ఎకరాలు సస్యశ్యామలం అయినయ్. పాత చెరువు తుమ్మలకుంట పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరిగాయి. ఆ చెరువు పక్కనే ఉన్న మా 8 ఎకరాల చేనులో మూడు పంటలు తీస్తున్నాం. తాగుసాగునీటికి ఇపుడు మా గ్రామంల కరువు లేదు. మేము 24 గంటల ఉచిత విద్యుత్‌తోనే 5 హెచ్‌పీ మోటరు పెట్టి నీటి తడులు ఇస్తున్నాం. రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నాం. కాంగ్రెసోళ్ల 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీల మోటర్ల మాటలతో రైతులోకం బాధ పడుతున్నది. మళ్లా రైతుబంధు ఆపించిన్రు. రైతులకు అండగా నిలిచిన కేసీఆరే మళ్లీ సీఎం కావాలి. మేమంతా కేసీఆర్ సార్‌కు కృజ్ఞతగానే ఉన్నాం.

**- దొంతుల సుభాష్, రైతు, పిప్పల్ కోటి, భీంపూర్ మండలం**

### ❖ ధరిణి రద్దయితే భూములకు భద్రత కరువు..



నార్నూర్, నవంబర్ 26 : కేసీఆర్ సీఎం అయ్యాక ధరణి తెచ్చి రైతుల భూములకు భద్రత కల్పించు. గిప్పుడు అరగంటలోనే రిజిస్ట్రేషన్లు సులభతరం అవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి ఎత్తేస్తామంటున్నారు. ధరణి ఎత్తేస్తే ఎనుకటి కష్టాలు తప్పవు. మళ్లీ పట్వారీ వ్యవస్థ వచ్చి రైతుల్లో భూ తగాదాలు పెరిగి అశాంతి నెలకొంటుంది. రైతుల మధ్య చిచ్చుపెట్టాలని చేసే కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి. రైతులకు భూ సమస్యలేకుండా ఉండాలంటే ధరణిని కొనసాగించాల్సిందే. **- కుమ్ర జ్ఞానేశ్వర్(గుంజాల,రైతు)**



### ❖ ధరణి ఉంటెనే గదా.. ఇట్ల పనులైతున్నయ్..

భీంపూర్, నవంబర్ 28 : నాకిపుడు 60 ఏండ్లు దాటినయ్. అప్పటి జమానాల ఎవుసం జూసిన. కష్టాలు జూసిన. ఇప్పుడు కేసీఆర్ సారు కాస్తకారి(రైతు)కి చేస్తున్న సాయం కండ్లారా జూస్తున్న. మా ఊరికి తలాపునే పెన్‌గంగ ఉన్నా అప్పుడు నీళ్లిచ్చుకునే పరిస్థితుల్లేవు. ఇప్పుడు మూడు పంటలుదీత్తున్నం. చేండ్ల నుంచి ఇట్లా రోజూ ఏరిన పత్తిని ఎడ్లబండిల ఇంటికి, తర్వాత మార్కెట్‌కు తీసుకపోగలుగుతున్నం. ఇక నేను పాత తరం రైతును కాబట్టి చెప్తున్న. అప్పుడు పట్టాలు కావాలన్నా పరేషా ఉండే. పట్వారీ నుంచి తహసీల్దార్ దాకా పైసలిచ్చుడు తప్పేదికాదు. ఒగొల్ల భూమి ఇంకొకరి పేరిట రాస్తుండిరి. అది మర్రా సరిచేయ్యాలంటే తాతలు దిగచ్చినంత పనైతుండే. ఇపుడు కేసీఆర్ సారు తెచ్చిన ధరణితో ఆ కష్టాల్లేవు. మా కుటుంబానికి సంబంధించి విరాసత్ ఒక గంటల అయ్యింది. వారంలనే కొత్త పాసు పుస్తకాలచ్చినయ్. ధరణి ఉంటేనే మా అసొంటి రైతులకు మంచిది. కాంగ్రెస్ పెద్దలకు కాస్తకారి మీద ఎంత పగనో మేము టీవీలల్ల జూత్తేనే ఉన్నం. అందుకు అందరికీ మంచి చేస్తున్న కేసీఆర్ సారే ముఖ్యమంత్రిగా ఉండాలె. మా ఊళ్లె అందరి మాట ఇది. ఇగ ఇప్పుడు కాంగ్రెస్‌కు బుద్ధిజెప్తం.

**- బైరెడ్డి రాజన్న, రైతు, అంతర్గాం, భీంపూర్ మండలం**

# రైతాంగానికి నష్టం

## కరెంటియ్యక కంటిమీద కునుకులేకుండా చేసిన్రు

- పాస్‌బుక్కులు ఇయ్యక హక్కుల్లేకుండా చేసిన్రు
- చాలా మంది ఆత్మహత్యలు చేసుకున్నరు
- బీఆర్‌ఎస్‌తోనే అన్ని విధాలా అభివృద్ధి అని రైతుల స్పష్టం

*'ధరణి పోర్టల్‌ను తీసివేస్తామని.., 3 గంటల కరెంటే ఇస్తామని.., 10 హెచ్‌పీ మోటర్లు వాడుకోవాని కాంగ్రెసోళ్లు చేస్తున్న ప్రకటనలతో రైతుకు తీరని నష్టం కలుగుతది. గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ లేక కంటిమీద కునుకులేకుండా చేసిన్రు. రైతులకు పాస్‌బుక్‌లు ఇవ్వకపోవడంతో హక్కులు పొందలేదు. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ ఏర్పాటు చేసి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించారు. 24 గంటల ఉచిత కరెంట్ అందించి, రైతులను ఆదుకుంటున్నరు. కాంగ్రెసోళ్లు చెప్తున్న మాటలతో రైతు భూమి హక్కులు కోల్పోతాడు. కరెంటు ఉండది. పంటలు ఎండిపోతయ్. అన్ని విధాలా రైతాంగానికి నష్టం వాటిల్లుతుంది..' అని రైతులు అంటున్నారు.*

### ❖ కేసీఆర్‌తోనే రైతులకు లాభం



ఉట్నూర్, నవంబర్ 28 : ముఖ్యమంత్రిగా కేసీఆర్ అయినంకనే రైతులు లాభపడ్డారు. లేకుంటే ఈ భూములకు ధరలెక్కడివి. ఎరువులు, విత్తనాలు ఎక్కడ అందినయ్. వర్షాకాలం పోయినంక కూడా ఎరువులు, విత్తనాలు దొరక్కపాయె. అసువంటిది వర్షాకాలం కంటే ముందే గోదాముల్లల్ల విత్తనాలు, ఎరువులు దించి సమయానికి ఇచ్చిండు. రైతుబంధు పథకంతో పైసలు కూడా అకౌంట్లళ్ల ఏసింది కేసీఆరేనాయె. ఇప్పుడు ఎన్నికలు రాంగనే 24 గంటలు అచ్చే కరెంటును 3 గంటలు ఇయ్యాలంటే ఏమన్నట్టు. అటువంటి కాంగ్రెస్ పార్టీలను ఎవడూ నమ్మడు. దొంగ పార్టీలను గెలిపిస్తే మన బతుకులు ఆగమైతయ్.

**- టెబొటే భీంరావ్, రైతు, ఏందా, ఉట్నూర్ మండలం**

### ❖ ఎన్నికల ముందే మాట మార్చిన రేవంత్ రెడ్డి..



ఇచ్చోడ, నవంబర్ 28 : కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతుబంధుపై భూయజమానికి గానీ కౌలు రైతుకు గానీ ఎవరికో ఒకరికే రైతుబంధు ఇసానని ఇప్పుడు మాట మారుస్తున్నడు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు, భూయజమానికి ఇస్తామని చెప్పారు. ఇప్పుడు ఎవరికో ఒకరికే అందిస్తామని చెప్తున్న, ఎన్నికల ముందే మాట మార్చుతున్న రేవంత్ రెడ్డికి రైతులు ఓటుతోనే బుద్ధిచెప్తారు. ఇప్పుడు అబద్ధాలు అడుతున్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే రైతులకు ఇచ్చిన హామీలపై మోసం చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్‌ను రైతులు నమ్మే పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం రైతుబంధు రూ.16 వేలకు అందిస్తామని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పొందుపర్చారు. రైతుల కోసం పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఓటు వేసి గెలిపిస్తాం.

**- షేక్ మహమ్మద్, రైతు, మాదాపూర్, ఇచ్చోడ మండలం**



### ❖ కాంగ్రెస్ ఎప్పటికీ రైతు వ్యతిరేకే..

తాంసి, నవంబర్ 28 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు దొంగ హామీలను ఇస్తున్నది. మొన్నటి వరకు రైతుబంధును రైతులు, కౌలుదారులకు కూడా ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఇద్దరిలో ఒకరికే ఇస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమే. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రైతు వ్యతిరేకే. ఆ పార్టీ నాయకులకు ప్రజలు సంతోషం ఉండడం ఇష్టంలేదు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు మళ్లీ పాత రోజులే వస్తాయి. రాష్ట్రంలో రైతులు, ప్రజలు మంచిగా జీవించాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలి. కాంగ్రెస్, బీజేపీలు రానే రావు. కేసీఆర్ సర్కారు మల్లా గెలుపు ఖాయం. **- ఎం.అశోక్, రైతు, తాంసి**

### ❖ 24 గంటల కరెంట్ కావాలే



ఉట్నూర్, నవంబర్ 28 : తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంట్ వచ్చింది. ఇప్పుడు కాంగ్రెసొళ్లు 3 గంటలు ఇస్తం అంటే ఎవరు ఒప్పుకోరు. అసలు కాంగ్రెస్ ఎప్పుడు సక్కగా కరెంట్ ఇయ్యలె. అసొంటోళ్లు కరెంట్ గురించి మాట్లాడుతరా. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్‌కే రైతులు ఓట్లు వేస్తరు. రైతులకు నష్టం చేసిన కాంగ్రెసోళ్లకు అసలు ఓట్లడిగే అధికారమే లేదు. కేసీఆర్ సారు పుల్లు కరెంట్ ఇస్తనే ఇయల ఊళ్లల్ల మంచిగా పంటలు పండుతున్నయ్, రైతుబంధుతోని బాకీలు లేకుంట చేసుకుంటున్నం. తెలంగాణలో తెలంగాణ పార్టీనే రావాలి. ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆరే ఉండాలె. **- రాథోడ్ జహేందర్(ఏందా, ఉట్నూర్)**